క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం కావడంతో ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, నిత్యపూజల అనంతరం హారతులిచ్చి పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు చీర, సారె, పిండివంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పూర్వ విద్యార్థులు వివరాలు నమోదు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులంతా http://www.gdcnandyal.ac.in/alumregfrom.php ద్వారా కళాశాల వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించడానికి కళాశాల పూర్వ విద్యార్థి శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందించామని చెప్పారు. కావున విద్యార్థులు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 9440878658, 9866418418 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో అండర్ -16 నంద్యాల జిల్లా బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఫుట్‌బాల్ పోటీలను సంఘం అధ్యక్షుడు కేతః వినయ్‌సాగర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మొత్తం 120 మంది క్రీడాకారులు పాల్గొనగా.. నంద్యాల జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు సంబంధించి బాలికలు, బాలల జట్టును 16 మంది చొప్పున ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక జట్టు త్వరలో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దివాకర్, హరివరం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, అనిల్‌బాబు, జగదీష్, రాజు, రాజా చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దాం

నంద్యాల(వ్యవసాయం): ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ఆరోగ్య భారతి పని చేస్తుందని ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తల శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సహదేవుడు హాజరై ఆహారం, ఆరోగ్యం, గృహ వైద్యం, శస్త్ర చికిత్స విషయాలపై అవగాహన కల్పించారు. వైద్యులు యశోదర, గీత, రామశర్మ, మాధవచౌదరి, కుమారస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

దొర్నిపాడు: ఈనెల 12వ తేదీ నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం, హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్‌లో అండర్ 14, 17 బాలబాలికలకు ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో రాణించిన వారిని నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పీడీ దేవేంద్ర తెలిపారు.

ప్రో వాలీబాల్ విజేత వైట్ వాకర్స్ టీం



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక గురురాజ ఇంట్రా స్కూల్‌లో జరిగిన ప్రో వాలీబాల్ పోటీల్లో వైట్ వాకర్స్ టీం విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన పోటీల్లో రైజింగ్ స్టార్స్, వాకర్స్ జట్లు తలపడగా వాకర్స్ జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, నంద్యాల ఎంఈఓ బ్రహ్మం బహుమతులు అందజేశారు.అభిషెక్కు బెస్ట్ ప్లేయర్ అవార్డు ప్రదానం చేశారు.

పురుగు మందు ప్రభావంతో అస్వస్థత

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తులకు చెందిన జగన్ అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జగన్ ఆదివారం తన సొంత పొలంలో వరి పంటలో తెగుళ్ల నివారణకు విష గుళికలు చల్లుతుండగా విష ప్రభావానికి అక్కడే కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక వైద్యశాలలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సేద్యం .. నాడు అసాధ్యం.. నేడు సుభిక్షం

- అన్నదాతలకు అండగా ప్రభుత్వం
- వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో విస్తృత సేవలు
- రాయితీపై యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, విత్తనాల పంపిణీ
- భూసార పరీక్షల నుంచి దిగుబడి విక్రయాల వరకు అన్నీ అక్కడే.

మట్టిమనిషి సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, కష్టాల మయమైన సాగును లాభాల మూటగా మార్చాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నలకు అడుగడునా అండగా నిలుస్తోంది. ఇక భూసార పరీక్షల నుంచి దిగుబడి విక్రయం వరకు గ్రామం నుంచి బయటకు రావాల్సిన అవసరం లేకుండా వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. పంటల సాగులో చేపట్టాల్సిన చర్యలు, అనుసరించాల్సిన పద్ధతులు, ఎలాంటి పంటలు వేయాలి, ఏ మందులు వాడాలి తదితర సలహాలు, సూచనలిచ్చేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసింది.



చాపిరేవుల ఆర్బీకే ద్వారా రైతులకు ఎరువులను అందిస్తున్న అధికారులు (ఫైల్)



ఆర్బీకేలో ఎరువులను నిల్వ చేస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(అర్బన్): గతంలో విత్తనాలు,ఎరువులు పొందాలంటే అదో ప్రహసనం. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో వారు ప్రకటించిన సమయంలో ఎన్ని పనులున్నా మానుకొని పంపిణీ కేంద్రాల వద్దకు సంబంధిత ధ్రువ పత్రాలతో వెళ్లి రోజుల తరబడి క్యూలైనల్లో బారులుదీరి, అష్టకష్టాల కోర్చి తెచ్చుకోవలసి వచ్చేది. ఒక్కోసారి స్టాక్ అయిపోతే మరోరోజు రమ్మని చెప్పేవారు. నిత్యం పొలాల్లో ఎంత రెక్కల కష్టం చేసినా రాని అసహనం, కోపం, అలసట.. విత్తనాలు, ఎరువులు తెచ్చుకునే సమయంలో వారిలో ఆవహించేవి. అవన్నీ భరించి పంటలు సాగు చేసి దిగుబడి చేతికందే సమయానికి దిగుబడులకు మద్దతు ధర ఉండదు. దళారులు గద్దల్లా వాలిపోయి రైతన్న కష్టాన్ని తక్కువ ధరతో కొనుగోలు చేసి దోపిడీకి పాల్పడే వారు. ఏదో కొంతైనా మిగలకపోతుందా అని వచ్చిన చూసి చూద్దామంటే నష్టాలు మాత్రమే కనిపించేవి. దీంతో కంటి నీరు.. అపరాధం చేసిన వాడిలా తలదించుకుని వెళ్లాల్సిన దుస్థితి. గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలకు ఆ కష్టాలు మళ్లీ రాకూడదని భావించి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయానికి అవసరమైన సేవలన్నీ అందేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ప్రత్యేక భవనాలు నిర్మించి, సిబ్బందిని నియమించారు.

విప్లవాత్మక మార్పులు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసింది. మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, మొదలైనవన్నీ ఊర్లోనే అందేలా చర్యలు తీసుకుంది. ఈ సంస్కరణలు, జవాబు దారీతనంతో అందిస్తున్న సేవలు వ్యవసాయంపై రైతుకు భరోసా ఇచ్చాయి. వ్యవసాయం దండగ నుంచి నేడు పండుగలా మారింది.

రైతులకు చేదోడువాదోడుగా సలహా మండళ్లు..

మండలంలోని 20 గ్రామాల్లో 21 రైతు భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయి. ప్రధానంగా వరి, పత్తి, మిరప, మినుము, మొక్కజొన్నతో పాటు ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ప్రభుత్వం కూడా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అనేక సేవలు అందుబాటులోకి తెచ్చింది. గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఉద్యాన శాఖ సిబ్బందిని నియమించింది. ప్రతి గ్రామంలో రైతులకు నాణ్యమైన సేవలు అందించడానికి వ్యవసాయ సలహా మండలితో పాటు మండల స్థాయిలో కూడా ఏర్పాటు చేసింది. ప్రతి నెలా మొదటి శుక్రవారం గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులతో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తోంది. ఆ నెలలో రైతులకు అందాల్సిన సేవలపై చర్చించి, ప్రాధాన్యత క్రమంలో ప్రణాళిక తయారు చేసుకుంటారు. రెండో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించి గ్రామాల నుంచి వచ్చిన అంశాలపై చర్చించి మండల స్థాయిలో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

రైతులకు ఆర్థిక సాయం..

మండలంలోని రైతులకు రైతు భరోసా పథకం, పంటల బీమా, వడ్డీ రాయితీ, క్రాప్ డ్యామేజ్, ఇన్‌పుట్ సబ్సిడీల కింద ప్రభుత్వం రూ.కోట్లాది రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు మండల రైతులకు అందిన మండల రైతులకు ఐదు విడతలుగా అందిన ప్రభుత్వ సాయం వివరాలు..

పథకం పేరు	రైతులు	నగదు (రూ.ల్లో)
పీఎం కిసాన్, రైతుభరోసా	38,753	47,22,25,500
వడ్డీ రాయితీ	3,768	74,94,092.37
పంటల బీమా	5,249	6,36,14,981
ఇన్‌పుట్ సబ్సిడీ	6,705	6,17,11,056
యంత్రసేవ పథకం గ్రూపులు	మొత్తం నగదు (రూ.ల్లో)	సబ్సిడీ నగదు (రూ.ల్లో)
324	2,25,82,555	79,69,729

పెట్టుబడి సాయం అందుతోంది



ఆర్బీకేల ద్వారా ఐదేళ్లుగా రైతు భరోసా సాయం అందుతుంది. నాడు పాదయాత్రలో మాటిచ్చిన ప్రకారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతులకు పెట్టుబడి సాయాన్ని 2019 నుంచి అందుతోంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో పంటలునష్టపోయిన వారికి పరిహారం చెల్లించి ఆదుకుంటుండటం అభినందనీయం.
-దూదేకుల ఖాసీం, రైతు, కానాలగ్రామం, నంద్యాల.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రైతు మిత్రా గ్రూపు కింద ట్రాక్టర్ తీసుకున్నా. మొత్తం రూ.7.72 లక్షలకు గాను ప్రభుత్వం రూ.3 లక్షలు రాయితీ ఇచ్చింది. ట్రాక్టర్ చేతిలో ఉండటంతో తక్కువ ఖర్చుతో చిన్న, సన్న కారు రైతులంతా సకాలంలో పొలాన్ని దున్నుకుంటున్నారు. వ్యవసాయంలో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
- వెలుగోటి దుర్గన్న,రైతు, అయ్యలూరు గ్రామం

రైతులకు సత్వరమే సేవలు



విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు లోగడ రైతులు దగ్గరలో ఉన్న పట్టణానికో, మండల కేంద్రాలకో వెళ్లి తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అన్నీ రైతు భరోసా కేంద్రాల్లోనే అందిస్తున్నాం. రైతులకు వ్యవసాయానికి కావలసిన సమాచారమంతా ఇక్కడే ఇస్తున్నాం. ప్రభుత్వ పథకాలు,విత్తనాలపై సబ్సిడీలను త్వరితగతిన అందిస్తున్నాం. రైతులకు సత్వరమే సేవలు అందించడంలో రైతు భరోసా కేంద్రాలు చురుగ్గా పని చేస్తున్నాయి. -ప్రసాదరావు, ఏఓ, నంద్యాల

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకుందాం



మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 18వ తేదీ నుంచి పట్టణంలో జరుపుకునే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని, మండపాల వద్ద భక్తి వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు. మైకులను ఉదయం 6.30 నుంచి 10గంటల వరకు, రాత్రి 6 నుంచి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. గణేష్ నిమజ్జనం రోజున విగ్రహాలను త్వరగా నిమజ్జనానికి తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలను సేవించి ఊరేగింపులో పాల్గొనరాదన్నారు. ఏదైనా సమస్యలు వచ్చినచో దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో గాని, కేంద్ర సమితి వారికి తెలియజేయాలన్నారు. గణేష్ కేంద్ర సమితి మహోత్సవ నాయకులు గంగిశెట్టి శ్రీధర్, వెంకటదాసు, నాగేంద్ర, సుధాకర్, చలంబాబు, కేశవమూర్తి, రవీంద్రనాథ్, శంకర్, మోహన్, నాగరాజు, కేశవమూర్తి పాల్గొన్నారు.

మా ప్రభుత్వంలో పేదల ఆర్థిక పురోగతి



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న నవరత్నాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ శివారులోని పడకండ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి ప్రజల మన్ననలను అందుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నా, అర్హులై ఉండి పథకాలు అందకపోతే తెలియజేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు ఏఈ సురేంద్ర, నాయకులు సీపీ శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, చిన్నరామిరెడ్డి, చిన్నవెంకటసుబ్బయ్య, గోపాల్, రాజ ఉన్నారు.

మైనార్టీలను ఆదరించింది వైఎస్సార్‌సీపీనే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా

బొమ్మలసత్రం: ఎన్నడూ లేని విధంగా.. ముస్లిం, మైనార్టీలను ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌సలామ్ కుటుంబ సభ్యుల గురించి చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఉద్యోగంతో పాటు రూ.25 లక్షల పరిహారం అందజేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. మైనార్టీల పట్ల ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుండటాన్ని చంద్రబాబు తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, నాయకులు సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, ఆరిఫ్, తబ్రేజ్, సమ్మద్ పాల్గొన్నారు.

ఖరీఫ్ కోతలు ప్రారంభం



పేరూరు సమీపంలో మినుము పంట కోస్తున్న యంత్రం



ఎర్రగుడిదిన్నె వద్ద మినుములను ఆరబెట్టుకుంటున్న రైతు



హరినగరం వద్ద ఆరబోసిన మొక్కజొన్నలు

రుద్రవరం: మండలంలో ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంట కాలం పూర్తి కావడంతో రైతులు యంత్రాలతో కోతలు ప్రారంభించారు. దిగుబడులను కళ్లాలు, బయలు ప్రదేశాలు, రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. అయితే వాతావరణం అనుకూలించక పోవడంతో దిగుబడులు తగ్గినప్పటికీ ధరలు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతల్లో భరోసా వ్యక్తమవుతోంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే ముందస్తుగానే దాదాపు 1500 ఎకరాల్లో మినుము, 6వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ బోరు మోటార్ల ద్వారా నీరు పారించి పంటలు పండించారు. పంట కాలం పూర్తి కావడంతో కోతలు మొదలయ్యాయి. పేరూరు, ఎర్రగుడిదిన్నె తదితర గ్రామాల పరిధిలో మినుము అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం కోతలు సాగిస్తుండటంతోఎకరాకు 5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోందని, ధర క్వింటాకు రూ.9వేల వరకు పలుకుతుండటంతో పెట్టుబడులు పోయి కాస్తో కూస్తో లాభాలు వస్తాయని చెబుతున్నారు. మొక్కజొన్న ముకుందాపురం వైపు కోతలు మొదలెట్టారు. దిగుబడులు ఎకరాకు 20 క్వింటాళ్లకు మించడం లేదని, ధర క్వింటా రూ.2వేలు పలుకుతోందని, పెట్టుబడులు పోనూ కొంతమేర మిగులుతుందని పేర్కొంటున్నారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిచంనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అయితే సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోని ఎడల బాధితులకు న్యాయం జరగకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు సమర్పించుకోవాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

ఆత్మజ్ఞానాన్ని కలిగి ఉండాలి

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానాన్ని కలిగి ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జ్ఞానప్రసాద్ గురూజీ పేర్కొన్నారు. పట్టణంలోని అమ్మవారిశాల గీతామందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీతను దినచర్యలో భాగంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి వాసు, తిమ్మయ్య, రామకృష్ణ, అంజి, రాజాచారి, మహిళా సంఘం నాయకులు ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

చాగలమర్రి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని రిక్వెస్ట్ స్టాప్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎస్టీయూ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అనురాధ, ఎంఈఓ-2 న్యామతుల్లా, హెచ్‌ఎం కోటయ్య, ఎస్టీయూ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు శివశంకర్, నారాయణరెడ్డి, నాగేంద్ర కుమార్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఆలస్యమైనా.. న్యాయం గెలిచింది

- చంద్రబాబు అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపు కాదు
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: కాస్త ఆలస్యమైనా చివరకు న్యాయం గెలుస్తుందని చెప్పడానికి ఈ రోజు చంద్రబాబునాయుడును న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించడమే రుజువని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతమైన, ఆదర్శనీయమైన పాలన సాగుతుందన్నారు. చంద్రబాబుది అక్రమ అరెస్ట్ కాదని, అనివార్యమైన అరెస్ట్ అన్నారు. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చి దిద్దుతామని రూ.3,300 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుని 90 శాతం కంపెనీకి, 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని తీసుకున్న ఎంఓయూను పక్కన పెట్టి అందులో రూ.370 కోట్లకు పైగా షెల్ కంపెనీల ద్వారా రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి దొరికిపోయారన్నారు. అరెస్ట్ చేయడం వల్ల ప్రజలు కక్ష సాధింపుగా చూస్తారని, తద్వారా సానుభూతి వస్తుందని టీడీపీ, పచ్చ మీడియా భావించినా.. అవేవీ జరగలేదని చెప్పారు. కక్ష సాధింపు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుకుని ఉంటే 2021లో కేసు ఫైల్ చేసినప్పుడే అరెస్ట్ చేసి ఉండేవారన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి ఢిల్లీ నుంచి లాయర్లను పిలిపించి వాదించినా, చివరకు తానే లాయర్ అవతారం ఎత్తి వాదించినా చంద్రబాబుకు రిమాండ్‌కు తప్పలేదని పేర్కొన్నారు. చంద్రబాబు, టీడీపీ వాదనలు చూస్తే ఎక్కడా తాను అవినీతి చేయలేదని చెప్పలేదని, కేవలం తనను 24 గంటల్లోపు కోర్టులో ప్రవేశపెట్టలేదని, అరెస్ట్ చేసే ముందు గవర్నర్‌కు చెప్పలేదని, రిమాండ్ రిపోర్ట్‌లో పేరు మొదట్లో లేదని, నంద్యాల కోర్టులోనే ప్రవేశపెట్టి ఉండాలని, పీసీ యాక్ట్ ప్రకారం వారం ముందు నోటీస్ ఇవ్వాలి కదా .. అనే వాదనలు చేశారు తప్ప.. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన కుంభకోణంలో తనకు పాత్ర లేదని ఎక్కడా వాదించక పోవడాన్ని ప్రజలు గమనించాలన్నారు. నేను అవినీతి పరుడిని కాదు, ఎలాంటి విచారకరణకైనా సిద్ధం లాంటి పదాలు చంద్రబాబు నోట ఒక్కసారైనా రాకపోవడం గమనార్హమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీపీ శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

శిరివెళ్ల: రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988-89 సంవత్సరం విద్యార్థులు కలుసుకున్నారు. 34 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకొని నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు.ప్రస్తుతం ఎక్కడ స్థిరపడింది, కుటుంబం వివరాలను పంచుకుని బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు నరసింహులు, గోవిందరాజులు, పొన్నేశ్వరి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరెడ్డి, రాధా కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి పాటు పడతామని పూర్వ విద్యార్థులు హామీనిచ్చారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు

నంద్యాల(న్యూటౌన్): ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని సైక్రియాటిస్ట్ డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని న్యూక్లియస్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ జీవన గమనంలో సమస్యలను అధిగమిస్తూ పూర్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పిల్లలతో సానుకూల దృక్పదాన్ని పెంపొందించాలని, తద్వారా ఆత్మహత్యలకు నివారించవచ్చన్నారు. శేషఫణి, నీలం వెంకటేశ్వర్లు, ప్రసాద్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు



కేరళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడె గోలు నాయక్‌ను విచారిస్తున్న పోలీసులు

చాగలమర్రి: మండలంలోని ఓజీ. తండాకు చెందిన మూడె గోలు నాయక్ అనే గిరిజనుడిపై డి.వనిపెంట సెక్షన్ అధికారి దాడి చేశాడని అతని బంధువు బుక్కె భీముడు నాయక్ ఆదివారం రాత్రి చాగలమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భీముడు నాయక్ మాట్లాడుతూ.. డి.వనిపెంట సెక్షన్ ఫారెస్టు సిబ్బంది గోలు నాయక్‌ను శనివారం సాయంత్రం ముత్యాలపాడు గ్రామంలో అదుపులోకి తీసుకొని చాగలమర్రిలోని అటవీ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లి, రూ.3820 జరిమానా వసూలు చేసి, బంధువైన భీముడు నాయక్‌కు పలిపించి బాండ్ పేపర్‌పై సాక్షి సంతకాలు తీసుకొని గోలు నాయక్‌ను వదిలిపెట్టారన్నారు. గోలు నాయక్ ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

చెట్టు నరకడంతో జరిమానా విధించాం

డి.వనిపెంట సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో కొందరు స్మగ్లరు తిరుగుతున్నారని శనివారం సమాచారం అందడంతో అటవీ ప్రాంతంలో వెళ్లగా బిల్లు, బట్టగెనుపు చెట్టు నరికి తీసుకెళ్లినట్లు అనవాళ్లు లభించాయి. వాటిని గోలు నాయక్ నరికినట్లు సమాచారం అందడంతో అతనిని ఎఫ్‌బీఓలు మదన్, శుభాష్ అదుపులోకి తీసుకొని చాగలమర్రిలోని అటవీశాఖ కార్యాలయంలో విచారించగా నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశాం కానీ దాడి చేయలేదు. నిందితుడి బంధువులకు తెలియజేసి రూ.3,820 జరిమానా విధించి పెద్ద మనుషుల పూచీకత్తుతో వదలేశాం. ఇతనిపై గతంలో కూడా కేసులు ఉన్నాయి.
- పెద్దన్న, డి.వనిపెంట సెక్షన్ అధికారి